

# నిత్యానందంగారి విజ్ఞానయాత్ర

## సోమంచి యజ్ఞన్న శాస్త్రి

కనిపించిన కుంక అల్లా, ఏమండోయ్ నిత్యానందంగారూ, ఎంతవరకొచ్చింది, మీ విజ్ఞానయాత్ర అని అడిగేవాళ్లే. దిష్టి తగలక ఏం చేస్తుంది. పురిట్లోనే సంధి కొట్టింది. అదేమి టంటావా ? మొదట్నించీ చెబుతా విను.

ఓనాడు నేనూ, రంగాచారీ, మస్తాన్, సుభాష్ చంద్రబోసూ, చంద్రరావూ మా యింటి అరుగుమీద కూర్చుని బాతాఖానీ కొడుతున్నాము. అసలు ఎప్పుడూ చెంతెన గట్టుమీద కూచుని బాతాఖానీ వేసేవాళ్ళం. మా ఆవిడ తగాదా పెడితే, మాయింటి అరుగుమీదికి మార్చాము. ఇదీ మానుకో మని మా ఆవిడ పేచీ పెడుతోందనుకోండి. అయినా ఎలాగో సముదాయించి, వారానికో మాటయినా కలుసుకుంటున్నాము. మాటల సందర్భంలో నేనన్నాను. 'ఒరేయ్. మనం మరీ వేసిన గొంగళీలా అయిపోతున్నాంరా. దేశాటనం చేస్తే, జ్ఞానం వృద్ధి అవుతుందం టారు. మనం ఓమాటు దేశ సంచారానికి బయలుదేరాలిరా'

'నాకూ అదే అనిపిస్తోందిరా' అన్నాడు చంద్రరావు.

'ఏడిశావు. నాకు అనిపించినప్పుడే నీకూ అనిపించిందేం'

"నిజం. ఇవాళే ఓ ప్రకటన చదువుతూవుంటే అనిపించింది."

"ఏమిట్రా ఆ ప్రకటన !"

'ఇదిగో వినండి.... "మంచిసమయము, మించిన దొరకదు.



త్వరపడుడు. త్వరపడుడు. కన్యాకుమారినించి బదరీనాథము వరకూ పుణ్య క్షేత్రముల దర్శించి తరించండి. చవక. అతిచవక. కన్నుల పండువైన సుందర దృశ్యాలు. పుష్టికరమైన భోజనాలు. రాఘవరావుగారి సంపూర్ణ యాత్రాస్పెషల్‌లో కడుపులో చల్ల కదలకుండా ప్రయాణం చెయ్యండి. పుణ్యమార్జించుకోండి. చవక. అతిచవక. మడిగా ప్రయాణం చెయ్యదల చినవారికి ప్రత్యేకసౌకర్యాలు. త్వరపడుడు. రాఘవరావుగారి సంపూర్ణ యాత్రా స్పెషల్. కొద్ది టిక్కెట్లే మిగిలాయి.'

ఇది చదివినప్పుడే నాకూ ఆ బుద్ధి పుట్టింది. మనంకూడా బయలుదేరితేసరి." అన్నాడు చంద్రరావు.

"ప్రకటల్ని చూసి మోసపోకూడదు" అన్నాడు సుభాష్‌చంద్రబోసు. ఓ సంవత్సరం క్రితం పదిరూపాయలు పెట్టి వాచో రిస్టువాచీ కొన్నాడు. కొండ మీద నించి యెత్తేసినా, సముద్రంలో ముంచేసినా అది పాడవదనీ, ఆగదనీ పేపర్లో గ్యారంటీ చూసి, బ్రహ్మాండమైన వాచీ చవగ్గా వొచ్చేస్తోందని మురిసిపోయి కొనేశాడు. వొద్దని మేం హెచ్చరిస్తున్నా వినకుండా కొనేశాడు. పన్నెండు గంటలన్నా తిరక్కుండా ఆగిపోయింది. కొండమీద నించి యెత్తేసినప్పుడు ఆగిపోతే బాగుచేస్తాం కాని ఇంట్లో కూర్చుని చేతిని పెట్టుకున్నప్పుడు తిరగడం మానేస్తే బాగుచేస్తామన్న గ్యారంటీ లేదంటుంది కంపెనీ. వీడింకా కంపెనీకి ఉత్తరాలు వ్రాస్తూనే వున్నాడు; వాళ్ళు జవాబులు వ్రాయడం మానుకున్నా !

"భయపడకురా. అందరూ నీలాగే పప్పులో కాలేస్తామనుకున్నావురా ! వివరాల న్నీ తెలుసుకునే డిసైడ్ చేస్తాం. ఏమయినా గోల్డెన్ అపర్చూనిటీలా వుంది! వొదులుకో కూడదు." అన్నాడు చంద్రరావు.

"పథ్నాలుగు కారక్టర్ల గోల్డెన్ అపర్చూనిటీ" అన్నాడు రంగాచారి.

"కారక్టర్లు కాదురా. కారట్లు" అన్నాను.

'ఏడిశావు. మహా తెలిసిన వాడిలా మాట్లాడకు. కారట్ అంటే ఇంగ్లీషుకూర. పచ్చిది కూడా తినొచ్చు. అదెందుకుంటుంది" అన్నాడు రంగాచారి. వాడికి వాదించడమంటే చాలా యిష్టం. ప్రతిదానికీ ఎద్దేమంటే తెడ్డేమంటాడు. పెడర్థాలు తీస్తాడు.

"కారట్లు బంగారంలో కాదు. పులుసులో వుండొచ్చును" అన్నాడు.

'కారక్టర్ మనుష్యులకుంటుంది గాని, బంగారానికి కారక్టరేమిటి ?'

'కల్తీబంగారానికి కారక్టర్ తక్కువన్న మాట'

'నాన్సెన్సు. బంగారానికి వుండేది కారటే'

"గోన్‌సంచి. బంగారానికి వుండేది కారక్టరే"

"కాదు"

"అవును"

"కా....దు !"

"అ....వు....ను"

"ఛాలెంజి. మా ఆవిడని అడుగుదామా"

"మీ ఆవిడ అథారిటీ నీమీదగాని నాకేమిట్రా. ఛాలెంజి పిలు చూద్దాం" అన్నాడు రంగాచారి.

"వొద్దు బాబో వొద్దు, ఆవిడతో వాదించి గెలవడానికి నీ ముత్తాతలు దిగి రావాలి,



అసలు అడంగులకి యిందులో ప్రమేయం లేదు." అన్నాడు సుభాష్‌చంద్రబోసు. నేతాజీపేరెట్టుకుని గూడా. అడంగులంటే డంగెత్తిపోతాడేం వీడు." అన్నాడు రంగాచారి.

"సుబ్బాయమ్మగారి కొంగు పట్టుకుని వాదనలో దిగే నిత్యానందం శిఖండిని ముందెట్టుకు కదనరంగంలో ఉరికిన భీష్మాచార్యుడు. వాడిని జయించడం యెవరికీ తరంగాదు. వెనక్కి తగ్గు' అన్నాడు చంద్రరావు.

"శిఖండిముందెట్టుకున్నది భీష్మాచార్యులురా! ఆయన్ని చంపటానికి అర్జునుడు శిఖండిని ముందెట్టుకున్నాడు" అన్నాడు మస్తాన్ సాయిబు.

"అందుకే కలికాలం. సాయిబుకి తెలిసిన పాటి మన పురాణాలు మనకి తెలియకుండా పోయాయి." అన్నాడు సుభాష్ చంద్రబోసు.

"నీ పురాణజ్ఞానం ఏడిసినట్టుంటే, నీ వుపమానం అఘోరించినట్టుంది. సుబ్బాయమ్మగారిని శిఖండితో పోల్చిన వైనం ఆవిడగారి చెవినిబడితే మనకి ఉద్వాసనం." అన్నాడు మస్తాన్. సాయిబయినా, ఫస్టు మార్కులు తెలుగులో ఎప్పుడూ వాడివే!

"నోరుమూసుకోండిరా. మా ఆవిడ సంగతెత్తకండి." అన్నాను.

"అదే నేనూ ఇస్తున్న సలహా." అన్నాడు మస్తాన్.

"సాయిబు సలహాలు బోడిసలహాలు. మరోలా వుండడానికి వీలులేదు." అన్నాడు రంగాచారి.

"పంగనామం పెట్టేసలహాలు ఆచార్లవి" అన్నాడు మస్తాన్. "గుండులేని సాయిబువి నువ్వూ, నామంలేని ఆచార్లు వాడూ ఇద్దరూ కూడా ట్రేడుమార్కులేని మనుష్యులు. ఆ మార్కులేని వస్తువులకి విలువలేదు. మీ సలహాలకి విలవలేదు!" అన్నాడు చంద్రరావు.

‘పంచపాండవులంటే నేనెరగనా, మంచంకోళ్ళలా ముగ్గురేకాదా అనేవాడివి నీకు వేరే ట్రేడుమార్కు అక్కర్లేదు. మైలు దూరం కంపుకొట్టే కల్తీ నెయ్యిలాటిది నీ సలహా; దానికి దూరంనుంచే నమస్కార బాణం విసిరెయ్యాలి." అన్నాడు రంగాచారి. "అదేవిధంగా సుబ్బాయమ్మగారికి దూరంనించే ఓ నమస్కారం చేసి వూరుకుంటేనే బతికిపోతాం." అన్నాడు సుభాష్.

"విశ్వాసఘాతకుల్లారా! తిన్న ఇంటివాసాలు లెక్కపెట్టే మనుష్యుల్లారా, మాయింటి అరుగుమీద కూర్చునే మా ఆవిడని మాట అంటారురా,'అన్నాను. కోపమొచ్చిందేమో, కొంచెం గట్టిగా అరిచినట్టున్నాను.

‘ఏమండీ, ఓ మాటిలారండి' అనిలోపల నించి మా ఆవిడ కేక వినిపించింది.

"శ్రీమద్రమారమణ గోవిందో హరి" అన్నాడు ఆచారి.

"తినవలసిన చీవాట్లేమిటో కిక్కురుమనకుండా త్వరగా తినేసి వొచ్చెయ్యి" అని సలహా యిచ్చాడు సుభాష్.

"అవునవును. మాటకి మాట తెగులు. నీటికి నాచు తెగులు" అన్నారు. జవాబు చెబితే మొహం మరికొంచెం వాస్తుంది. ఈ చెవిలోంచి విని, ఆ చెవిలోంచి వొదిలేసి త్వరగావొచ్చెయ్యి" అన్నాడు చంద్రరావు.

"ఆరునెల్లయి కాపరంచేస్తున్నాడు. వాడికన్నీ తెలుసులెండిరా. ‘వెళ్ళిరా నాయనా, వెళ్ళిరా' అన్నాడు మస్తాన్.

‘గప్‌చిప్. అందరూ షటప్' అన్నాను.

‘అర్జెంటుగా రండీ' అని మళ్ళీ మా ఆవిడ కేక.

భయంలేదని యెంతధైర్యం చెప్పుకున్నా గుండెలు గుభీ గుభీమని కొట్టుకోడం ప్రారంభించాయి. మా మాటలు వినే పిలిస్తే సముదాయించడం కష్టమే. అల్లరి మూకను యింట్లో చేరొద్దని ఎప్పుడూ బుద్ధి చెబుతూనే వుంటుంది. నోరుదగ్గిర పెట్టుకుని మాట్లాడండిరా అంటే వాళ్ళకి బుద్ధిలేదు. మధ్య నాకు ప్రాణసంకటం. పెద్దపులిలా బయలుదేరామనుకున్నాను; కాని పిల్లిపిల్లలా అడుగులు పడ్డాయి.

‘సాతాళించిన శనగలున్నాయి తినండి' అంది మా ఆవిడ.

‘శనగలు తినడానికా పిలిచావు'

‘ఏం? మీ కిష్టమేగా'

అమ్మయ్య! ప్రాణం కుదటబడింది.

‘ఇష్టమే. వాళ్ళందరూ వుండగా....'

‘మరేం పరవాలేదు. తినేసి నీళ్ళు తాగెయ్యండి.'

మావాళ్ళందరూ డింకీ తినేశారు. మా ఆవిడ చీవాట్లు పెడుతుందనుకున్నాడు. సాతాళించిన శనగలు పెట్టింది. శ్రావణ మంగళవారంనాడు పేరంటానికెళ్ళి తీసుకొచ్చిన శనగలు. ఒకే రుచిగా వున్నాయి. గబగబ బొక్కెయ్యడం ప్రారంభించాను. "నమలకుండా మింగెయ్యకండి. రాత్రంతా కడుపునెప్పితో బాధ పడాలి. అవతల



ముంచుకొచ్చిన పనేంలేదు. సావకాశంగా కూర్చొని నమిలితినండి." కసిరినట్టు మాట్లాడుతుందిగాని మా ఆవిడకి నేనంటే చాలా యిష్టమే. నాకు కడుపునెప్పి రాకుండా చాలా సలహాలిస్తూ వుంటుంది.

'వాళ్ళందరూ....'

'ఉంటే వున్నారు....అందరూ కలిసి చేసేపని గ్రుద్దిగుగ్రానికి పళ్ళు తోమడమేగా.'

'నా. నా....పనిలేని మంగలి చేస్తాం.'

'క్షవరం ప్రారంభించారా. పిల్లిని వెతికి పట్టుకోడంలోనే వున్నారా ఇంకా."

మా ఆవిడకి ఏదైనా చెబితే యిట్టే అర్థమయిపోతుంది. సరదాగా వున్నప్పుడు జోకు చేస్తే జవాబు జోకూ చేస్తుంది. సరసాలాడ్డానికి సమయం అనుకూలంగా వున్నట్టు కనిపించినా మాటలు పెట్టుకు కూర్చుంటే అవతల వాళ్ళు తిట్టుకుంటారని, జవాబుచెప్పకుండా త్వర త్వరగా తినేసి, మంచినీళ్ళు తాగి త్రేన్చేశాను.

'బాతాఖానీ త్వరగా తెమిల్చేసి యింట్లో పడండి' అంది మా ఆవిడ.

"వొట్టి బాతాఖానీ కాదు. పూర్ణయాత్రా స్పెషల్‌లో, దేశ సంచారానికి బయలుదేరుదామని ప్లానులు వేస్తున్నాం.'

'ఆ అల్లరి మూక తోటా?'

'తూముగట్టుమీద కూర్చుని బాతాఖానీ కొట్టినప్పుడు అల్లరిమూకగాని . యాత్రా స్పెషల్‌లో ప్రయాణం చేసేటప్పుడు గొప్ప భక్తులుగా మారిపోతాం'

'మీరు వాళ్ళతో ఒక్కరూ వెళ్ళడానికి వీల్లేదు. నేనూ వొస్తాను'

'నువ్వుకూడానా ?'

'అవును',



'నువ్వేందుకు ?'

'మీ రెందుకు'.

'మొగాళ్ళందరమూ'

'ఆ రైల్లో ఆడవాళ్లందరాయేమిటి ?

'మా ఆల్లరి మూకతో'.

'అల్లరిమూకగాదు. గొప్పభక్తులని మీరే అన్నారుగా'

అన్నా, నామాట మీదే పట్టేసుకుందే. ఇహవాదించి లాభం లేదు.

'అలాగేలే. మేం వెళ్ళితే నువ్వూవొద్దువుగాని' అని స్నేహితుల్ని చేరుకున్నాను.

'వారేయ్, తల తడవనీ, ఎన్నిబొప్పెలు కట్టాయో' అన్నాడు రంగాచారి.

'ఆవిడింకా చెయ్యిచేసుకోడం దాకా రాలేదురా. కూకలేస్తుంది. చీవాట్లు తినిపిస్తుంది. మొహం ఎంత వాచిందో చూద్దాం.' అన్నాడు మస్తాన్.

'నోరు ముయ్యండిరా. మనం తీర్థయాత్రలకి వెళితే తనుకూడా వొస్తానని చెప్పడానికి పిలిచింది. అంతే' అన్నాను. బాగుండదని సాతాళించిన శనగల సంగతి చెప్పలేదు.

'ఆడవాళ్ళతో ప్రయాణం పడదు' అన్నాడు సుభాష్.

పూర్ణయాత్రా స్పెషల్ లో నూటికి డెబ్భయి పైగా ఆడవాళ్ళుంటారు. అదీ ఒక ఎట్రాక్షన్' అన్నాడు చంద్రరావు.

"దాంట్లో ముప్పాతికమంది విధవలై వుంటారు. మడిగా భోజనాలున్నాయన్నావు. బోడి attraction జోరుగా వుంటుందన్నమాట. పుణ్యంలో మరో పుణ్యం. లేవగానే గుళ్ళ దర్శనం! శ్రీమద్రమారమణ గోవిందో హరి!" అన్నాడు రంగాచారి.

"మాయింట్లో అరుగు మీద కూర్చున్నప్పుడు పోకిరీమాటలు మాట్లాడకండి" అని కసిరాను.

"తీర్థయాత్ర ప్లాను నాకేం నచ్చలేదు. మనమేం పాపాలు చేశామా ?" అన్నాడు సుభాష్.

'పాపాలు చేసిన తరవాతనే పుణ్యార్జించాలని లేదురా. బాంకులో డబ్బు నిలవచేసుకున్నట్టు ముందుగానే పుణ్యార్జించుకుని చిత్రగుప్తుడిదగ్గర దాచుకోవచ్చును' అన్నాడు రంగాచారి. 'పుణ్యం

---

● మేష్టారు ఒక అబ్బాయిని పిలిచి: "రామూ! ఇవ్వాళ నువ్వు చేసిన ఒక మంచి పనిచెప్పు."

రాము : "నేను, ఇంకొక నలుగురు స్నేహితులం కలసి స్కూలుకు వస్తూ ఒక ముసలి గుడ్డిస్త్రీని రోడ్డు దాటించామండి."

మేష్టారు : "శేష్. మంచి పనిచేశారు. కాని ఒక ముసలిదాన్ని రోడ్డు దాటించడానిక్ అయిదుగురు కావలసివచ్చారా ?"

రాము : "అవునండి. ఆ ముసలిది అక్కడే వుంటానన్నదండి. బలవంతాన దాటించాల్సి వచ్చిందండి."

మాట దేవుడెరుగును. దేశం తిరుగుతే జ్ఞానం పెరుగుతుంది' అన్నాను.

"అయితే తిన్నగా విజ్ఞానయాత్రకే బయలుదేరక డొంకతిరుగుడుగా తీర్థ యాత్రలకెందుకు ?"- సుభాష్.

"ఒక్కరాయితో రెండుపిట్టల్ని కొట్ట డానికి" -

"రంగాచారి తీర్థయాత్రా స్పెషల్‌లో పిట్టల వేటంటే, ఆరాయి తిరిగొచ్చి మనకే తగిలి, పళ్ళూడవచ్చు" - సుభాష్.

"ఈ మాటలు మాఆవిడ వింటే ఇప్పుడే వూడతాయి మీకు."

"యాత్రలంటే నేను రాలేను" అన్నాడు మస్తాన్.

'నిజమేరోయ్. పూర్ణయాత్రాస్పెషల్‌లో సాయబుల్ని రానిస్తారో లేదో' అన్నాను.

"మస్తాన్‌గాడు సాయిబేమిటి ? బొట్టు పెడితే బ్రాహ్మడే !"అన్నాడు చంద్రరావు.

'అవునవును.

బొట్టు కట్టుకూర్చిపట్టింపు లెక్కపై
శైవవైష్ణవులకు సమరమైన
ఒకడు సున్నియయ్యె నొకడు షియాయయ్యె
విశ్వదాభిరామ వినురవేమ'

అన్నారు కృష్ణశాస్త్రిగారు. వీడు అలా సాయబయిన బ్రాహ్మడే' అన్నాడు రంగాచారి.

"వాడికి పులిహోరంటే చాలాయిష్టం. వైష్ణవంలోంచి జారినవాడే అనుకుంటాను." అన్నాడు సుభాష్.

'సందేహంలేదు. అడియేన్ దాసోహం. మస్తానాచార్లుగారు' అన్నాడు చంద్రరావు.

"తీర్థయాత్రకంటే నేను రాను."

"మక్కామదీనా. నీతో మేమూ వస్తాం రా. పులివేషాలవెంట పీర్లపంజాలకి మేమూ వొచ్చేవాళ్ళంగా"

"విజ్ఞానయాత్రకయితే నేనొస్తాగాని, తీర్థ యాత్రకయితే నేను రాను."

"మాకూ యాత్రలక్కర్లేదు. విజ్ఞాన యాత్రకే బయలుదేరుదాం. బైరాగి టిక్కెట్లే మున్నాయో కనుక్కుందాము."

"మొదట ఏ యే వూళ్ళు వెళ్ళాలో లిస్టు తయారు చెయ్యాలి. తరవాత టిక్కెట్ల కోసం వాకబు చెయ్యవచ్చును."

'దొరికే టిక్కెట్టునిబట్టి టిక్కెట్టు కొనాలా, వెళ్ళే వూళ్ళనిబట్టి టిక్కెట్టు కొనాలా' అన్నాను.

"చెట్టుముందా, విత్తు ముందాలాటి ప్రశ్న వేశావురా" అన్నాడు రంగాచారి.

"అదీగాదు. ఇదీకాదు. డబ్బునిపట్టి ప్రోగ్రాము. మనం ఎంతఖర్చుపెట్టగలమో ముందు తేల్చుకోవాలి." అన్నాడు సుభాష్. వాడు నయాపైసలు లెక్కపెట్టకుండా దేన్లోకి దిగడు.

"వీడు తీతువు పిట్టలా యెప్పుడూ డబ్బు సంగతే యెత్తుతాడు. వెధవడబ్బు. ఏమంచి పని చెయ్యాలన్నా అడ్డు తగిలిస్తాడు. అన్నాడు చంద్రరావు.

"ఏం చేస్తాం. కలికాలం, టిక్కెట్టు చూపిస్తేనేగాని రైలెక్కనివ్వరు. ఎంత బడ్జట్లో చెప్పండి."

"నువ్వేచెప్పు."

"పదిహేను రూపాయలు"

"ముష్టి పదిహేను రూపాయలా !"

"నాదగ్గిరదాచుకున్నడబ్బు అంతేవుంది. ఇంకా యెక్కువ ఖర్చుపెట్టాలంటే మీరెవ రన్నా మదుపుపెడితే, మెల్లిగా తీర్చు కుంటాను."

"మదుపుపెట్టడానికి ఎవరిదగ్గిరా డబ్బు పాతర్లేదు."

"అయితే పదిహేనురూపాయల బడ్జెట్ లోనే టూర్ తయారు చెయ్యాలి."

"పదిహేను రూపాయలలో మన వూళ్లో బయలుదేరితే విజయవాడో, గుంటూరో వెళ్ళి రావచ్చును. విజ్ఞానానికి, వినోదానికీ ఆవూళ్ళో సినిమాచూసి వొచ్చెయ్యాలి" అన్నాడు రంగాచారి.

"ఏడిశావు. నీకేం తెలుసురా. ఆంధ్ర దేశపు పూర్వపు ఔన్నత్యం. విజయవాడ గుంటూరులమధ్య యెన్ని గొప్ప ప్రదేశాలు కాలగర్భంలో కలిసిపోయాయో, తెలుగు తల్లి వ్యాసాలు చదివితే తెలిసుంతును" అన్నాడు సుభాష్.

"అయితే చెప్పకూడదూ"

'అమరావతి వెళదాము.'

'ఏముంది అమరావతిలో.'

"అమరావతిలోనా? అమరావతిలో చాలా గొప్ప....గొప్ప విషయ్యాలున్నాయి."

"ఏమిటా గొప్ప విషయాలు ?"

"వివరాలు నాకు జ్ఞాపకం లేవుగాని చాలా గొప్ప విషయాలున్నాయి."

"ఇదివరకు ప్రకటన చూసి వాచీ కొన్నావు, ఇప్పుడు తెలుగుతల్లి వ్యాసం చదివి అమరావతి రమ్మంటావు. నిన్ను నమ్ముకుని బయలుదేరితే కుక్కతోక పట్టుకుని గోదావరి యీదినట్టే"

'నిన్ను నమ్ముకుంటే యింకా అనర్థం.'

'ఏమిటో ఆ అనర్థం.'

'చెబితే ఏడిచిపోతావు'

'ఏడవను'

'ఏడుస్తావు'

'ఏడవనంటే'

"ఏడుస్తావంటే"

"ఏడిస్తే ఏడిచాను; చెప్పు చూద్దాం"

"చెప్పనా ?"

"చెప్పు"

"చెప్పెయ్యనా"

"చెప్పేసెయ్యి."

"నోరుమూసుకోండిరా, రామాయణంలో యీ పిడకల వేటేమిట్రా" అన్నాను.

"పిడకలవేటకాదు; పిచికల వేట" అన్నాడు రంగాచారి.

"వారే నీ కన్నీ తెలిసినట్టు మాట్లాడి ప్రతిదానికీ వాదం పెంచకు. ఇప్పుడు మన ప్రయాణం సంగతి తేల్చనీ...."

"అమరావతే వెళదాము."

"మన తెలుగుతల్లి మళ్లీ చదివి యింకా దగ్గిర్లో పదిహేను రూపాయల ఖర్చులో తేలిపోయే గొప్పగొప్ప వూళ్ళున్నాయేమో తణిఖీచేసి మరీ నిర్ణయానికొద్దాం."

"అవసరంలేదు. అమరావతి దగ్గిరగా వుంది. ఖండాంతరాలకి వ్యాపించిన కీర్తిగల మరో వూరు ఆంధ్రదేశంలో లేనూలేదు."

"సరే. అక్కడ ఏమివున్నాయో, ఏమేమి చూడాలో లిస్టు తయారుచెయ్యి మొదట" అన్నాడు రంగాచారి.

"మంచి భోజనం ఆవీ యెక్కడ దొరకు తుందో ముందర వాకబు చెయ్యి" అన్నాడు చంద్రరావు. వాడికి ఎప్పుడు చూసినా తిండి రంధే.

"మరేం భయంలేదు. పూటకూళ్ళమ్మలు వుండకపోరు" అన్నాడు సుభాష్.

"పూటకూళ్ళమ్మలా. ఇంకానయం. పేద రాసి పెద్దమ్మలు వుంటారన్నావుగాదు. పెద్దమ్మా, పెద్దమ్మా యీపూళ్కో వింత లేమిటి అని అడుక్కుంటూ తిరుగుదామను కుంటున్నావా" అన్నాడు రంగాచారి.

'అదేంపనికిరాదు. విజ్ఞానయాత్ర చాలా organised గా చెయ్యాలి.'' అన్నాను.

వివరాలన్నీ తయారుచేసి ఇదుగోలాదేరా అన్న నా ప్రతిపాదన అందరూ ఏకగ్రీ వంగా అంగీకరించారు,

"మనం ప్రతియేడూ ఓ విజ్ఞానయాత్రకి వెళ్లాలి."

"ఆలిలేదు; చూలిలేదు. కొడుకు పేరు సోమలింగం! ఒకటికానీ, తరువాత ప్రతి యేడూ సంగతి ఆలోచిద్దాం!" మరికొంత తర్జనభర్జన జరిగినతర్వాత ఈ యేటియాత్ర అమరావతికని నిర్ణయానికి కొచ్చేశాము. ప్రయాణానికి వారం వర్జంచూసి ముహూర్తం పెట్టించాలని కూడా నిశ్చయించేశాము. మా ఆవిడకూడా వొస్తానని పట్టుపడుతుం దని భయపడ్డానుగాని. ఆవిడ అమరావతి యిదివరకే చాలామాట్లు చూశాననీ, రాళ్లూ రప్పలూ తప్ప అక్కడేమీ లేవనీ మాతో రానంది. బతుకు జీవుడా అనుకున్నాము; మనస్సులోనే అనుకో. ఆదివారం పొద్దున్న ఏడుగంటలకిందికి ప్రయాణం నిశ్చయం చేసుకున్నాం. ఆరుగంటలనుంచే వర్జం కనుక, అయిదున్నరకల్లా ఇంటిదగ్గిర్నించి బయలుదేరి ఆరులోపల స్టేషనుకి చేరుకో మన్నారు, పంచాంగం శాస్త్రుల్లుగారు. వర్జం గిర్జం నాకు లేదు. నేను ఆరున్నరకిగాని రానని మస్తాన్‌గాడు తగాదాపెట్టినా "ఒరే మనమందరం కలిసికట్టుగా వెళ్లాలి. గంగలో ఉరికినా చెట్టాపట్టాలేసుకొనే వురకాలి. మా అందరికీ వర్జముంటే. నువ్వు సాయబువయినా, నీకు వర్జముందనే ఒప్పుకోవాలి." అని వాడికి నచ్చచెప్పి ఒప్పించేసరికి మా తాతలు దిగొచ్చారు.

మేమందరమూ మా ఇంటిదగ్గిర కలుసు కుని స్టేషనుకి వెళ్ళాలని నిశ్చయించు



కున్నాము. ప్రయాణంరోజున తెల్లారు ఝామున మూడింటినుంచీ నాకు నిద్దరపట్ట లేదు. నాలుగున్నరకల్లా చద్దన్నం కూడా తిని తయారుగా వున్నాను. ఓ అరగంట అయిన తరవాత చంద్రరావూ, సుభాష్



చంద్రబోసూ, రంగాచారీ కలిసొచ్చారు. చంద్రరావు, వాడిపాతకోటు డ్రెస్సువేసు కొచ్చాడు. షర్టు పొట్టి అయిపోయి చంకల్లో పట్టేసుకుంది. ఉస్సురస్సురంటాడు. సౌటు






వాళ్ళమ్మ చెవిగాలి తగలకుండా మఫ్లరు చుట్టి పంపించింది. చెవిదగ్గర అరిస్తేనేగాని వాడికేమీ వినిపించదు. నేనుకూడా మాపు ఆగే నేవీ రంగు బ్లూపాంటూ, కాషాయ

యూనిఫారమ్‌లో వుండే అరటిక్కట్టు మీద ప్రయాణం చెయ్యొచ్చునని యెవరో చెప్పారుట. అందుకు పాతడ్రెస్ పైకితీసి దులిపి, చాలకపోయినా వేసుకొచ్చాడు. మీసాలొచ్చిన తరవాత ఏ డ్రెస్సువేసుకుంటే మాత్రం అరటిక్కట్టుమీద రైల్లో యెక్క నిస్తారా: ఆమాత్రం బుద్ధుండొద్దూ. ఏమన్నా అంటే మీకు తెలీదు. చూడండి, నే అర టిక్కట్టే కొంటానంటాడు. సుభాష్‌చంద్ర బోసు గాగుల్సు పెట్టుకొచ్చాడు. ప్రయా ణంలో ఎండతగలకుండా గాగుల్సు. తెల్లార లేదు.

ఈ గాగుల్సుతో చీకట్లో వాడికి తిన్నగా కళ్ళు కనిపించక స్కౌటు భుజం మీద చెయ్యేసి నడుచుకొచ్చాడు. రంగాచారికి



రంగుచొక్కా తొడుక్కున్నాను. ప్రయాణా లకి ఇవిస్పెషల్‌గా మా ఆవిడ కుట్టించింది. ఎంతదుమ్ముపడినా బట్టలు మాసినట్టుతెలీదు.

టైమయిపోతోంది. వర్షం రాకుండా బయలుదేరాలి. మస్తాన్‌రాడు. ఏంచెయ్యాలో తెలియక తికమక పడుతూవుంటే 'వొస్తూనే వుంటాడు. మీరు బయలుదేరండని సలహా యిచ్చింది మా ఆవిడ. ఇంతలోకి కాళ్ళు యీడ్చుకుంటూ మెల్లిగా వాడూ వొచ్చాడు. ఏమిట్రా యింత ఆలస్యమంటే వాడికి కాల్లో గాజుపెంకు దిగి రక్తం కారిందిట. పలాస్త్రి పట్టీవేసి కట్టుకట్టి కుంటుకుంటూ వొచ్చాడుట. ఆహ నడవలేడుట. సైకిల్ రిక్షా యెక్కి స్టేషన్‌కి వెళ్ళాలన్నాడు.

రిక్షా యెక్కడా కనిపించలేదు. మహమ్మదుగారి దగ్గిరకి పర్వతం రాకపోతే పర్వతం దగ్గిరకే మహమ్మదుగారు వెళతారనీ, మస్తాన్ సాయిబు దగ్గిరకి సైకిల్ రిక్షా రాకపోతే, సైకిల్ రిక్షా దగ్గిరికి మస్తాన్‌గారే వెళతారనీ, దార్లో



ఎక్కడ కనిపిస్తే అక్కడ యెక్కే షరతుని బయలుదేరాం; చంద్రరావు భుజం మీద గాగుల్సు మూలాని కళ్ళు కనిపించని సుభాష్‌బోసు, కాల్లో గాజుపెంకు గుచ్చుకోడంవల్ల కుంటుతున్న మస్తాన్ సాయిబూ చేతులేసి నడవడం ప్రారంభించారు. "మీబరువు మొయ్యలేను. చేతులుతియ్యం" డంటాడు చంద్రరావు. స్కౌటు డ్రెస్సులో వున్నవాడు సహాయం చెయ్యనడానికి వీల్లేదు. కిక్కురుమనకు అని వాడి నోరు మూసి, బరువుమోపి, నడిపించబోయాం గాని, దొంగయెత్తువేసే గాడిదలాగ రోడ్డు మీద కూలబడి నడవనన్నాడు. రిక్షాలు కనిపించి, బేరమాడి యెక్కి స్టేషను చేరుకునే సరికి ఒక్క నిమిషం తక్కువ ఆరయింది. వర్షం రాలేదు.

'ఏమండీ రైలు టైముకొస్తుందా, లేటా' అని టిక్కట్ల మాస్టార్ని అడిగాను.

ఆయన కునికిపాట్లుపడుతూ వినిపించుకోలేదు.

"ఏమండోయ్ మాస్టారూ"

ఉలిక్కిపడి లేచి అరిచాడు. "ఏమిటి?"

నాలిక తడబడిపోయి అన్నాను "లేటు రైలుగా వొస్తుందాండీ"

"ఏమిటయ్యా"

"లేటు రైలుగా వొస్తుందాండి; కాదు కాదు, రైలు లేటుగా వొస్తోందాండి."

"ఏ రైలు"

"ఏడుగంటలకి రావాలే, అది లేటాండి!"

"ఆదా. అది మామూలుగా లేటుగానే వొస్తుంది."

"ఎంతలేటు"



"రైలొచ్చింతరవాతగాని ఎంతలేటయిందీ తెలీదు."

"టిక్కట్టిపిస్తారాండి"

"గంట కొట్టింతరవాత రండి"

"ఎప్పుడు కొడతారండి గంట."

"కొట్టినప్పుడు వినిపిస్తుందిలే నీకు"

నేనెంత మర్యాదగా ప్రశ్నవేస్తున్నాను. ఆయనెంత పొగరు జవాబు లిచ్చాడు. రెండు జెల్లలు కొడదామనుకున్నాను.

పోర్టరు నయం. వాడు చెప్పాడు రెండున్నర గంటలు లేటని.మూడుగంటలుకూచోవాలన్న మాట.

"వారేయ్ టైమయిపోయిందని నేతొందరగా వొచ్చేశానురా. రెంటికి వెళ్ళలేదు. ఓ మాటు యింటికి వెళ్ళొద్దామా" అన్నాడు సుభాష్ చంద్రబోసు.

"మరేం ఫరవాలేదు ఆపుకో."

"అస్తేసేపు ఆపుకోలేనురా"

"అయితే నువ్వు వెళ్ళిరా".

"మీరు ఇక్కడ కూర్చునేం చేస్తారు. మీరూ రావాలి.. ఎక్కడికి వెళ్ళినా అందరం కలిసివెళ్లాలని ఒప్పందంగా!"

ఒప్పందం మార్చలేక, సుభాష్ చంద్రబోసు రెంటికోసం మేమూ వెళ్ళాం. ఎంతకీ తెమిలిరాడు. ఆ తరవాత కాఫీ హోటలు. నే తొందరచేస్తే ఎవరూ వినిపించుకోరు. తొమ్మిదిన్నరకి గదా బండి. ఇప్పట్నించీ ఎందుకంటారు. నే పోరగా పోరగా చివరికి ఎనిమిదింపావుకి స్టేషను చేరుకున్నాం. టిక్కెట్కి అందరూ ఎగబడుతున్నారు. నేనూ గుంపులోజొరబడ్డాను. 'నాలుగున్నర టిక్కెట్లే కొనరోయ్' అని వెనకనించి చంద్రరావు కేక.

"స్కౌటుడ్యూటీలో ఫెయిలైపోయాడు. వాడు నిజం స్కౌటుకాదు, పూర్తి టిక్కట్టు కొనాలిసిందే వాడికి" అని మస్తాన్ కేక.

గుద్ది, కుమ్మి టిక్కట్లిచ్చే కంతలో చెయ్యి దూర్చవలసొచ్చింది.

"అయిదు టిక్కట్లిప్పించండి"అన్నాను.

"ఎక్కడికి"

"అమరావతికి"

"అమరావతా"

"అవునండి"

"అమరావతి టిక్కట్లులేవు"

అమరావతికి రైలు వెళ్ళదు. గుంటూరు దాకా వెళ్ళి, అక్కడినించి బస్సు మీద వెళ్ళాలన్న సంగతి ఆ తొందరలో మరిచిపోయి, అమరావతికి టిక్కట్టడిగేశాను."

నాలిక కొరుక్కుని "గుంటూరుకండి. అయిదు టిక్కట్లు".

"గుంటూరికి టిక్కట్లిప్పు డివ్వరు. మధ్యాహ్నం రెండుగంటలకి రండి."

"ఏం?"

"గుంటూరు బండి రెండున్నరకయ్యా. అరగంట ముందు టిక్కట్లిస్తారు."

"అదేమిటి? ఏడింటికి బండీ వుందిగా"

"అది వెళిపోయింది."

"ఎప్పుడు?"

"ఏడింటికే"

"రెండున్నర గంటలు లేటన్నారు. ఇప్పుడు బండి వొస్తోందిగా"

"అది వాల్తేరెళ్ళేబండి."

"గుంటూరు బండి"

"రెండున్నరకొస్తుంది"

"గుంటూరు బండి లేటొస్తుందన్నా రండీ"

"ఎవరన్నారు"

"పోర్టరు"

"వాడినే అడుగు".

"రెండున్నరకే గాని బండీ లేదనకండి. ఈలోపుగా యింకో బండేదైనా?"

"ఏమీలేదు. వెళ్ళండిమరి!"

"పోనీ, ఆ బండికి టిక్కట్లు యిప్పుడే యిచ్చెయ్యకూడదూ?"


"ఇవ్వడానికి వీల్లేదు"

"అదేమిటండీ. మీరు తలుచుకుంటే మీకు అడ్డుంటుందా ఇచ్చేసెయ్యండిసార్!"

ఎంతబతిమాలినా వినడు.

"ఏమయ్యోయ్, టిక్కట్లు కొంటేకొను. లేకపోతే వెళిపో. దాతాఖానీ వెయ్యకు" అని వెనక వాళ్ళగోల. పక్కకి నెట్టేశారు కూడాను. వొళ్ళు హూనమయిపోయి బయట పడ్డాను. పోర్టర్ని నిలవదీసి అడిగాను. నేను అమరావతిబండి ఎప్పుడొస్తుంది అని అడిగితే వాడు అన్నారం బండిని గురించి అడిగాను అనుకున్నాట్ట: అది లేటొస్తుందని చెప్పాట్ట. గుంటూరుబండి టైముకొచ్చి టైముకే వెళిపోయిందిట, సాధారణంగా అది కూడా లేటుగానే వొచ్చేది అయినా.

ఆ రోజునప్రయాణం ఆగిపోయింది.మళ్లీ ఇంకో మంచిరోజు చూసి బయలుదేరాలి. వర్షంలేకుండా వొచ్చినా రైలుతప్పిపోయింది. ఆలస్యంగా వర్షంలో వొస్తేనే రైలు దొరికుండును. ఈమాటు వారం వర్షం చూడకుండానే ప్రయాణం నిర్ణయించాలని పట్టుపట్టాడు మస్తాన్. మా ఆవిడ దానికి ఒప్పుకోదు. ప్రస్తుతానికి ప్రతిష్టంభన. అంచేత మా విజ్ఞానయాత్ర రంగాచారిగాడన్నట్టు శ్రీమద్రమారమణ గోవిందోహరి. □□□






# తెలుగు సామెతలు

[మన సామెతల మధ్య ఐకమత్యం లేదు
ఒకదాన్నొకటి అధిక్షేపించుకోవటం గమనించండి.]

తల్లిని మించిన దైవములేదు
అడగందే అమ్మయినా పెట్టదు.

●

ఆలస్యం అమృతం విషం
తొందరపాటు పనికిరాదు

●

మంచి కొంచెమైనా చాలు
మంచికి పోతే మంచినీళ్ళు పుట్టవు.

●

వింటే భారతం వినాలి తింటే గారెలు తినాలి
భారతం బొంకు రామాయణం రంకు
తినగా తినగా గారెలు కనరెక్కాయి

●

సంసారం సాగరం దుఃఖం
బ్రహ్మచారీ శతమర్కటః
బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా పనికిరాదు

●

వేపచెట్టుకు పాలుపోసి పెంచితేమాత్రం చేదుపోతుందా
తినగ తినగ వేము తియ్యనుండు

●

కులంకన్నా గుణం ప్రధానం
కులమింటి కోతైనా మేలు

●

ఇంటిదొంగను ఈశ్వరుడైనాపట్టలేడు.
ఈశ్వరాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు

పరుగెత్తి పాలుత్రాగేకన్న నిలబడి నీళ్ళుత్రాగడం నయం
పాలుపాలే, నీళ్ళు నీళ్లే

●

బాలవాక్యం బ్రహ్మవాక్యం
బాలనాయకత్వం బహునాయకత్వం పనికిరాదు
బ్రహ్మకైనను పుట్టు రిమ్మతెగులు

●

పాప మెక్కడుంటే భయం అక్కడ వుంటుంది.
పాపి సముద్రానికి పోతే అరికాలు తేమకాలేదు.

●

పాములలో మెలగవచ్చునుగాని స్వాములలో మెలగరాదు
పాముతో చెలిమి కత్తితో సాము,

●

బ్రతికివుంటే బలుసాకు తినవచ్చును
ప్రాణం కన్న మానం ప్రధానం

●

చేసిన పాపం చెంగున కట్టుకొని కాశీకిపోయినా కడతేరదు
చేసినపాపం చెబితే పోతుంది.

●

కథకు కాళ్లులేవు; ముంతకు చెవులు లేవు
కథ కంచికి, మనమింటికి.